సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నేడు ప్రత్యేక వైద్య శిబిరం

కంచరపాలెం: ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని శుక్రవారం మల్టీ స్పెషాలటీస్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పద్మశ్రీ పురస్కార గ్రహీత, వైద్య నిపుణుడు డాక్టర్ కూటికుప్పల సూర్యారావు తెలిపారు. కంచరపాలెంలోని కూటికుప్పల సూర్యారావు హాస్పిటల్ వద్ద గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ పనితీరు, గుండె సమర్థత, నరాల పటుత్వం, ఎముకుల దృఢత్వం, దృష్టిదోష పరీక్షలు, కంటి ఆపరేషన్లు ఉచితంగా చేసి మందులు అందిస్తారన్నారు. ప్రత్యేక వైద్య నిపుణుల పర్యవేక్షణలో వైద్య ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పక్కాగా పారిశుధ్య నిర్వహణ



సిబ్బందికి సూచనలిస్తున్న జెడ్సీ కృష్ణ

మర్రిపాలెం: వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని జీవీఎంసీ జోన్–5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. 53వ వార్డు మర్రిపాలెం పరిసర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ రోడ్లు, కాలువలు, గెడ్డల్లో చెత్తాచెదారం వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దుకాణాల వద్ద విధిగా చెత్తబుట్టలు ఉండేలా చూడాలని సూచించారు. డోర్ టు డోర్ కలెక్షన్ సక్రమంగా చేపట్టాలన్నారు. అనంతరం ఆయన సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించారు. జెడ్సీ వెంట వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయం సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన



గోపాలపట్నం బాలికల హైస్కూల్‌లో అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర పాఠశాల, మినర్వా పాఠశాలలో గురువారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలను ట్రాఫిక్ పోలీసులు నిర్వహించారు. గోపాలపట్నం సీఐ అశోక్‌కుమార్ రహదారి నిబంధనల గురించి విద్యార్థులకు వివరించారు. హెల్మెట్ ధారణ వల్ల ప్రమాదాల్లో ప్రాణాపాయం నుంచి కాపాడుకోగలమని తెలిపారు. మైనర్లు వాహనాలను నడపరాదన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకే ట్రాఫిక్ రూల్స్ ఉన్నాయని, వాటిని పాటించాలని సూచించారు. అతి వేగంగా, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇంట్లో ట్రాఫిక్ నిబంధనల గురించి చర్చించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అలరించిన 'కన్యాశుల్కం'



కన్యాశుల్కం నాటికలోని ఓ సన్నివేశం

తాటిచెట్లపాలెం: మహాకవి గురజాడ అప్పారావు వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం పోర్టు అథారిటీ, కె.వి.మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో గురువారం సాలగ్రామపురం సీతారామ కల్యాణ మండపం వద్ద గల సాగరి ఓపెన్ ఎయిర్ ఆడిటోరియంలో కన్యాశుల్కం నాటికను ప్రదర్శించారు. ఆద్యంతం ఆనాటి ఘట్టాలను వీక్షకుల ముందుంచారు. ముఖ్య అతిథులు దాడి వీరభద్రరావు, వి.వి.రమణమూర్తి, పైడా కృష్ణప్రసాద్, దాడి సత్యనారాయణ, ఐ.వెంకటేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



ఇది కదా అభివృద్ధి

రైతుబజార్‌కు కొత్తకళ

- 'నాడు–నేడు' పనులతో అభివృద్ధి
- మౌలిక సదుపాయాలు కల్పిస్తున్న మార్కెటింగ్ శాఖ
- నాణ్యమైన కూరగాయలు విక్రయిస్తున్న రైతులు
- వినియోగదారుల నుంచి పెరుగుతున్న ఆదరణ

నాణ్యమైన కూరగాయలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే రైతుబజార్ల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం **ప్రత్యేక దృష్టి సారించింది.** రైతులు, వ్యాపారులు, **వినియోగదారులు** ఎటువంటి ఇబ్బందు**లు పడకుండా చర్యలు** చేపడుతోంది. నాడు **రైతుబజార్ల దుస్థితి** ఘోరంగా ఉండేది. **వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం**లో వాటికి మహర్దశ **పట్టింది. లక్షల రూపా**యల నిధులతో రైతు**బజార్లను ఆధునికీక**రిస్తూ రోల్ మోడల్‌గా **తీర్చిదిద్దుతున్నారు.**



రైతుబజార్ గోడపై ఆకట్టుకునేలా పెయింటింగ్

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డులోని గోపాలపట్నం రైతుబజార్ ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ బజార్‌లో విశాలమైన పార్కింగ్ సదుపాయం ఉంది. దీని ఖాళీ స్థలంలో పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆటవస్తువులు ఆకట్టుకుంటున్నాయి. ఈ రైతుబజార్‌లో మొత్తం 192 స్టాళ్లు ఉన్నాయి. వాటిలో 161 రైతులకు కేటాయించారు. 29 కమర్షియల్. మరో స్టాల్‌లో తాగునీటి కోసం ఆర్‌వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ బజారుకు అరకు, గోపాలపట్నం చుట్టుపక్కల రైతులు, ఇతర ప్రాంతాల వారు వారి పంటలతోపాటు ఇతర పంటలు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. గతంలో ఒక పూట ఉండే రైతుబజార్‌ను.. వినియోగదారుల సౌకర్యార్థం మూడేళ్ల కిందట రెండు పూటలుగా మార్చారు. రోజుకు సుమారు 150 నుంచి 200 మందికి పైగా వినియోగదారులు వస్తుంటారు. పండగల సమయంలో వీరి తాకిడి మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ బజారులో నాణ్యమైన తాజా కూరగాయలు దొరుకుతాయని మంచి పేరు ఉంది. రైతులందరూ వినియోగదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవడంతో మంచి ఆదరణ పొందింది.



నాడు

పాడైన స్టాళ్ల పైకప్పులు



నేడు

నూతనంగా వేసిన పైకప్పులు

గోపాలపట్నం రైతుబజార్ విశేషాలు

- మొత్తం స్టాళ్లు 192
- రోజుకు 150 నుంచి 200 మంది వినియోగదారుల రాక
- పిల్లల కోసం ప్రత్యేకంగా ఆటపరికరాలు
- విశాలమైన పార్కింగ్ స్థలం



గోపాలపట్నం రైతుబజార్ ముఖద్వారం

రూ.15 లక్షలతో రైతుబజార్‌లో అభివృద్ధి పనులు

- జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుబజార్లలో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది.
- గోపాలపట్నం రైతుబజార్‌లో ఇటీవల రూ.15 లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టారు.
- నాడు–నేడు పనుల్లో భాగంగా రైతుబజార్‌లోని స్టాళ్ల పైకప్పులు మార్చారు. పాడైన వాటి స్థానంలో కొత్త రేకులు వేశారు.
- విద్యుత్ వైరింగ్‌లో పాడైన వాటిని మార్చి మరమ్మతులు చేపట్టారు.
- టాయిలెట్ల తలుపులను బాగు చేశారు.
- చిన్న చిన్న మరమ్మతులు పూర్తి చేశారు.
- రెండో విడతలో సీసీ కెమెరాలు మరమ్మతులు, ఇంజినీరింగ్ పనులు చేపట్టనున్నారు.

నాణ్యమైన సరకులు లభ్యం



గోపాలపట్నం రైతుబజార్‌లో నాణ్యమైన కూరగాయలు దొరుకుతాయి. ఎక్కువగా ఇక్కడికే వచ్చి సరకులు కొనుగోలు చేస్తుంటాను. ఇక్కడ స్టాళ్లు ఎక్కువ కావడంతో అన్ని సరకులు లభ్యమవతున్నాయి. రైతుబజార్‌లో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. వినియోగదారుల తాకిడి ఎక్కువగా ఉంటోంది.

– దేరెడ్ల సత్యనారాయణరెడ్డి, బాజీ జంక్షన్

రైతుబజార్‌లో మెరుగైన సౌకర్యాలు



గోపాలపట్నం రైతుబజార్‌లో సౌకర్యాలు మెరుగుపడుతున్నాయి. ఇంజినీరింగ్ పనులు కూడా పూర్తయితే ఇంకా బాగుంటుంది. సరకుల నాణ్యత బాగుంటుంది. తూనికలు కూడా సరిగ్గా ఉంటాయి. చాలా రకాల కూరగాయలు దొరుకుతాయి. అందుకే ఇక్కడికి వస్తుంటాను. ఇటీవల చేసిన మరమ్మతుల వల్ల రైతులకు ఇబ్బందులు తప్పాయి.

– చిరంజీవి, సాకేతపురం

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి



రైతుబజార్లలో మౌలిక వసతుల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుతం స్టాళ్ల మరమ్మతులు చేపట్టారు. ఎలక్ట్రికల్, పెయింటింగ్ పనులు జోరుగా జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఫిష్ ఆంధ్ర పథకం ద్వారా చేపల దుకాణాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నాం. ఇందుకోసం గోపాలపట్నం రైతుబజార్‌లో 500 స్క్వేర్ యార్డుల స్థలాన్ని గుర్తించాం.

– షేక్ యాసిన్, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారి

గురజాడ రచనలు అజరామరం

గోపాలపట్నం: మహాకవి గురజాడ అప్పారావు రచనలు అజరామరమని వక్తలు పేర్కొన్నారు. గురజాడ వర్ధంతి సందర్భంగా ఎస్‌ఏడీ రామకృష్ణ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, గురజాడ అప్పారావు ముని మనవడు జీవీ రవీంద్రుడు పాల్గొన్నారు. గురజాడ చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ రామకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గురజాడ భావజాలం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. రవీంద్రుడు మాట్లాడుతూ గురజాడ రచనలు సామాజిక రుగ్మతలపై పోరాడేవని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా ఉంటాయన్నారు. నేటి యువత గురజాడ రచనలు చదవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ రవీంద్రుడు, హెచ్‌ఎం శ్రీనివాసరావు

ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలి

- కలెక్టర్ మల్లికార్జున
- ఓటర్ల నమోదు, తొలగింపుపై సమీక్ష

గోపాలపట్నం: ఓట్ల నమోదు, తొలగింపుపై ఎన్నికల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్‌తో పాటు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన ఏఈవోలు, ఏఏఈవోలు, బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఫారం–6, 7లను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆన్‌లైన్ ద్వారా 50 నుంచి 100 వరకు ఫారం–7 దరఖాస్తు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగా జెన్యూన్ ఓట్లు తొలగించేందుకు యత్నిస్తున్నట్లు గుర్తించామని, వీటిపై క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఎక్కువ స్థాయిలో వచ్చే దరఖాస్తులు స్వీకరించవద్దన్నారు. డిసెంబర్ 2, 3 తేదీల్లో ఓటు నమోదు శిబిరాల్లో బీఎల్వోలు, సూపర్‌వైజర్లు విధిగా పాల్గోవాలని ఆదేశించారు. సమావేశంలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు, బీఎల్‌వోలు

విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

- సీతమ్మధార మండల విద్యా శాఖాధికారి రామారావు
- ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ తరగతులు

సీతమ్మధార: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి పెంచడం కోసం ప్రతి నెలా విద్యా శాఖ మండలి పరిధిలోని ఉపాధ్యాయులకు ఇన్ సర్వీస్ శిక్షణ లక్ష్యంగా తరగతులు నిర్వహిస్తోందని సీతమ్మధార మండల విద్యా శాఖ అధికారి డి.రామారావు తెలిపారు. సీతమ్మధార టీపీటీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో రెండో రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్న నేపథ్యంలో రెండు రోజుల శిక్షణ తరగతులు నిర్వహించామన్నారు. ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో 132 మంది ఉపాధ్యాయులకు రెండు విడతలుగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు తమ అనుభవాలను పంచుకుంటూ వారు ఎదుర్కొంటున్న ప్రశ్నలకు విద్యా పరంగా మిగిలిన ఉపాధ్యాయులతో చర్చించి తగు రీతిలో బోధించడానికి దోహదపడుతుందన్నారు. సీతమ్మధార మండల పరిధిలోని 25 పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు హాజరయ్యారు. వారికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్ రేణుకా దేవిజగన్, సీఆర్పీ రాధ, ప్రధానోపాధ్యాయులు చిలకా రమణా, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు ఉమాగాంధీ, సామాజిక ఉద్యమకారుడు భూషణం, ఏపీ ఎం.పి.ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిసిద్ధార్థ, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రూ.2.14 కోట్లతో అభివృద్ధి పనులు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డులో రూ.2.14 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన జరిగింది. కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు చల్లా రజిని ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు మేయర్ గొలగాని హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు కె.కె.రాజు సూచించారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు పనులను జరుగుతున్న సమయాల్లో పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలన్నారు. వార్డులోని మర్రిపాలెం పరిధి 104 ఏరియా, జ్యోతినగర్, లక్ష్మీనగర్, మహారాణి వీధి, సూర్యనగర్ ప్రాంతాల్లో బీటీ రోడ్డు, గెడ్డలకు రిటైనింగ్ వాల్, డ్రైనేజీలు, గెడ్డలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులు జరుగుతాయని కార్పొరేటర్ రజిని తెలిపారు. కార్యక్రమంలో జోన్–5 ఎస్ఈ వేణుగోపాల్, ఈఈ మచ్చిరాజు, డీఈ భరణికుమార్, ఏఈ రత్నాకర్‌రావు, మండల ఇన్‌చార్జ్‌లు జి.వి.రమణి, కృష్ణారావు, అమర్‌రెడ్డి, వార్డు నాయకుడు కణితి చిరంజీవి, నారాయణరెడ్డి, రమణారెడ్డి, అచ్యుతరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకటకుమారి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

మల్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ పాలన సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పశ్చిమ పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్ అన్నారు. కరోనా వంటి కష్టకాలంలో కూడా లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు ఆగకుండా అందాయని పేర్కొన్నారు. 61వ వార్డు జనతా కాలనీ సచివాలయం పరిధిలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ క్లస్టర్–1 అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ ఆధ్వర్యంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమం నిర్వహించారు. అతిథిగా పాల్గొన్న రెహమాన్ మాట్లాడుతూ ప్రజల కష్టాలను తన పాదయాత్ర ద్వారా తెలుసుకుని, వారికి అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలంతా మద్దతుగా నిలిచి మళ్లీ గెలిపించాలని కోరారు.

బద్రీనాథ్ మాట్లాడుతూ ఒక పక్క రాష్ట్రాభివృద్ధి.. మరో పక్క ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు రాష్ట్రాల నాయకులకు ఆదర్శంగా నిలిచారన్నారు. పూటకో అబద్ధం ఆడే ప్రతిపక్ష నేత చంద్రబాబు లాంటి నాయకుడు కావాలో.. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న కావాలో ప్రజలు ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. కార్పొరేటర్ కొణతాల సుధ మాట్లాడుతూ జనతా కాలనీ సచివాలయం పరిధిలో వివిధ పథకాల ద్వారా అర్హులైన వారికి రూ.18,33,58,000ను ఇంత వరకు అందించినట్లు తెలిపారు. గడిచిన కాలంలో ఏ నాయకుడు ఇంతలా ప్రజా సంక్షేమాన్ని అందించలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు జి.వి.ఎస్.ఎన్.రాజు (కేబుల్ వాసు), పశ్చిమ క్లస్టర్–2 అధ్యక్షుడు అంగ రామ్‌ప్రసాద్, నూకరెడ్డి, మధుబాబు, సోనూ తదితరులు పాల్గొన్నారు.

- 58వ వార్డు గుల్లలపాలెం, శ్రీరాంనగర్ ప్రాంత సచివాలయం పరిధిలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్.. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ పరిశీలకుడు ఎస్.ఎ.రెహమాన్ పాల్గొని మాట్లాడారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.



61వ వార్డు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్.ఎ.రెహమాన్

యువతి ఆత్మహత్యాయత్నం

మర్రిపాలెం: ప్రేమించిన యువకుడి తరపు వారు కొట్టారన్న నెపంతో ఒక యువతి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. రెడ్డి కంచరపాలేనికి చెందిన ఆర్.కీర్తి బర్మాక్యాంప్‌నకు చెందిన భరత్‌కుమార్ అనే యువకుడిని కొంతకాలంగా ప్రేమించింది. కీర్తి తండ్రి పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. బుధవారం ఉదయం కీర్తి ఇంటికి వెళ్లిన భరత్‌కుమార్ తల్లిదండ్రులు సత్య, రామకృష్ణ, కుటుంబ సభ్యులు కీర్తిని తిట్టడమే కాకుండా చేయి చేసుకున్నారు. దీంతో మనస్తాపానికి గురైన కీర్తి పినాయిల్ తాగగా తల్లి అడ్డుకుంది. ఆమెను కూడా వారు దూషించారు. కీర్తిని కుటుంబ సభ్యులు వెంటనే కేజీహెచ్‌కి తరలించారు. ఆస్పత్రిలో కీర్తి వద్ద పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ పి.వి.ఎల్.నరసింహం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దంపతులపై గుర్తుతెలియని వ్యక్తి దాడి

మర్రిపాలెం: ఇంట్లో దంపతులపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేసిన సంఘటన ఇది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం చెవిట రాముల వీధిలో కడవల వెంకటేశ్వరరావు(62) నివసిస్తున్నాడు. భార్యాభర్తలు టిఫిన్ షాపు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి వీరు ఇంట్లో టిఫిన్ సామగ్రి తయారు చేస్తుండగా ఒక గుర్తు తెలియని వ్యక్తి వీరిపై దాడి చేశాడు. బయట నుంచి తలుపు వేసి వెళ్లిపోయాడు. దంపతుల కేకలు విని ఇరుగుపొరుగు వారు వచ్చి తలుపు తీసి వెంకటేశ్వరరావుని కేజీహెచ్‌కి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు భద్రత కరవు

కూర్మన్నపాలెం: దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ కార్మిక కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం భరోసా లేకుండా చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1022వ రోజు, గురువారం సంస్థలోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం కార్మికులు మొక్కవోని సంకల్పంతో దీక్షలు చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం చూసీచూడనట్లుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. అణచివేత ధోరణి అవలంబించడం అన్యాయమన్నారు. కేంద్రప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం కార్మికవర్గానిదేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న నాయకులు

రోగులకు నాణ్యమైన సేవలే లక్ష్యం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- అగనంపూడి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పలు తీర్మానాలు

అగనంపూడి: ఆస్పత్రి అభివృద్ధి, రోగులకు నాణ్యమైన సేవలు అందించడమే అజెండాగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే, అగనంపూడి వంద పడకల ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ తిప్పల నాగిరెడ్డి అన్నారు. అగనంపూడి ఏరియా ఆస్పత్రిలో హెచ్‌డీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతుల కల్పన, కనీస అవసరాలపై సమావేశం నిర్వహించి, తీర్మానం చేసింది. రెండు కంప్యూటర్లు, ప్రింటర్లు కొనుగోలు చేయడానికి, చిన్న పిల్లల వైద్యానికి అవసరమైన పరికరాలు కొనుగోలు చేయడానికి, పెండింగ్ బిల్లులు చెల్లించడానికి, కంప్యూటర్లు, వివిధ పరికరాలు మరమ్మతులకు చేపట్టడానికి కమిటీ చర్చించి తీర్మానం చేసింది. ముందుగా ఆస్పత్రిలో వార్డులు పరిశీలించారు. నాడు–నేడు కార్యక్రమంలో జరుగుతున్న నిర్మాణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడువు తేదీలోగా నిర్మాణ పనులు పూర్తి చేసి వంద పడకలు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి, డాక్టర్ ఉష, గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, కమిటీ ప్రతినిధులు, నాయకులు ఇల్లపు ప్రసాద్, నక్కా కల్యాణి, రమణబాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, వైద్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే, హెచ్‌డీసీ చైర్మన్ నాగిరెడ్డి

10న శెట్టిబలిజ కార్తీక వన సమారాధన

సీతంపేట: ఈ నెల 10న అమలాపురం కొంకాపల్లి సమీపంలోని సత్తెమ్మతల్లి గుడి వద్ద శెట్టిబలిజ కార్తీక మాస వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘ అధికార ప్రతినిధి వాసంశెట్టి రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమ ప్రచార కరపత్రాలను శంకరమఠం రోడ్‌లోని ఒక హోటల్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8 గంటల నుంచి జరిగే వన సమారాధనలో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న శెట్టిబలిజ కులస్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విశాఖపట్నం నాయకులు కట్టా మల్లేశ్వరరావు, కడలి సుబ్బారావు, బొక్కా ఏడుకొండలు, బొక్కా బాలయ్య, వాసంశెట్టి అర్జునరావు, కడలి సింహాచలం, బి.మధు, కడలి సత్యనారాయణ, కడలి శివకేశవరావు, వాసర్ల బాలకృష్ణ, మామిడిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వాసంశెట్టి రాధాకృష్ణ